

ఘటనా స్థలంలో ప్రమాదానికి గురైన కారు



నందిత పాడె మోస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా, కౌశిక్‌రెడ్డి తదితరులు



లాస్య నందిత తల్లిని ఓదార్చుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

# ఎమ్మెల్యే లాస్య నందిత దుర్మరణం



లాస్య నందిత భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



నందిత భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న స్పీకర్ ప్రసాద్‌రావు

మొదటిపేజీ తరువాయి...

ప్రమాదానికి గురైంది. ఆ సమయంలో ఆ వాహనాన్ని ఆమె పీఏ కం డ్రైవర్ ఆకాశ్ నడుపుతున్నారు. అతివేగంతోపాటు నిర్లక్ష్యంగా వాహనం నడపడమే ప్రమాదానికి కారణమని పోలీసులు తేల్చారు. వంద కిలోమీటర్ల వేగంతో వాహనం నడపడంతో అది అదుపుతప్పి మొదట టిప్పర్‌ను, ఆ తర్వాత రహదారి పక్కన ఉన్న రెయిలింగ్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో కారు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. ముందు సీట్లో కూర్చున్న ఎమ్మెల్యే లాస్య నందిత తల, మెడకు తీవ్ర గాయాలయ్యాయి. కారు నడుపుతున్న ఆకాశ్ కాలికి గాయాలయ్యాయి. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే పటాన్‌చెరు పోలీసులు స్పందించి ఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్ర గాయాలపాలై వాహనంలో పడి ఉన్న ఎమ్మెల్యే లాస్య నందితను పోలీసులు హుటాహుటిన చికిత్స కోసం పటాన్‌చెరులోని ఒక ప్రైవేటు దవాఖానకు తరలించారు. వైద్యులు ఆమెను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. దీంతో పోలీసులు లాస్య నందిత కుటుంబసభ్యులకు సమాచారం అందజేశారు. కుటుంబసభ్యులతోపాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు సదరు దవాఖానకు చేరుకున్నారు. విగతజీవిగా ఉన్న లాస్య నందితను చూసి తల్లి, సోదరి కన్నీరు మున్నీరయ్యారు. కొద్ది గంటల క్రితంవరకు తమతో కలిసి ఉన్న లాస్యనందిత అంతలోనే రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం చూసి కుటుంబసభ్యులు తట్టుకోలేకపోయారు. ఆమె మృతదేహంపై పడి కుటుంబసభ్యులు రోదిస్తుండటం చూసి అక్కడున్నవారంతా కంట తడిపెట్టారు. రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు హైదరాబాద్ నుంచి వెనువెంటనే పటాన్‌చెరులోని ఆమెద దవాఖానకు చేరుకున్నారు.



లాస్య నందిత సోదరిని ఓదార్చుతున్న మహిళలు

ఎమ్మెల్యే లాస్య నందిత మృతదేహాన్ని చూసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. రోడ్డు ప్రమాదం గురించి పటాన్‌చెరు పోలీసులతో ఆరాతీశారు. ఆ తర్వాత లాస్య నందిత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు గాంధీ దవాఖానకు తరలించారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు లాస్య నందిత మృతదేహం ఉన్న అంబులెన్స్‌తోపాటు గాంధీ దవాఖానకు వెళ్లారు.

### రాత్రి దర్గాలో ప్రార్థనలు

లాస్య నందిత మృతితో ఆమె కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రోడ్డు ప్రమాదంలో కన్నుమూసేంత వరకు ఆమె తమ కుటుంబసభ్యులతోనే గడిపారు. గురువారం రాత్రి లాస్య నందిత తన తల్లి, అక్క కూతురుతో కలిసి సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఆరూర్ సమీపంలోని మిస్కన్‌షా బాబా దర్గాను సందర్శించారు. రాత్రి 12.30 గంటల నుంచి 3 గంటల వరకు దర్గా వద్ద ప్రార్థనలు చేసి అక్కడే కొద్దిసేపు నిద్రపోయారు. అనంతరం లాస్య నందిత కుటుంబసభ్యులతో కలిసి సికింద్రాబాద్‌లోని నివాసానికి మారుతి కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఇంటికి చేరుకున్న తర్వాత ఆకలి అవుతుండటంతో లాస్య నందిత అల్పాహారం చేసేందుకు పీఏ ఆకాశ్‌తో కలిసి సంగారెడ్డి వైపు బయలుదేరారు. ఎమ్మెల్యే లాస్య నందిత వాహనం ముందుసీట్లో కూర్చున్నారు. సికింద్రాబాద్ నుంచి కారులో బయలుదేరి తెల్లవారుజామున 4:58 గంటల ప్రాంతంలో శామీర్‌పేట వద్ద ఓఆర్‌ఆర్‌పైకి ప్రవేశించారు. ఆమె ప్రయాణిస్తున్న వాహనం సుల్తాన్‌పూర్ టోల్ ప్లాజా దాటిన తరువాత రోడ్డు ప్రమాదానికి గురైంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. కారులోని విడిభాగాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. ప్రమాదం తీవ్రతకు ముందుసీటులో కూర్చున్న లాస్య నందిత తలకు, మెడకు తీవ్ర గాయాలవ్వడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందారు.



ఎమ్మెల్యేగా లాస్య ప్రమాణం (ఫైల్)

### ఆకాశ్‌పై కేసు నమోదు

ఎమ్మెల్యే లాస్య నందిత మృతికి దారితీసిన కారణాలపై సంగారెడ్డి జిల్లా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. పోలీసులు, ఆర్టీఏ అధికారులు ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరుపై దర్యాప్తు చేశారు. ప్రమాద ఘటనపై జిల్లా ఏఎస్పీ సంజీవరావు సాయంత్రం మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మృతిపై ఎలాంటి అనుమానాలూ లేవని, ఓఆర్‌ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె మృతి చెందారని స్పష్టం చేశారు. అతివేగం, డ్రైవర్ ఆకాశ్ నిద్రమత్తులో ఉండటంతో రోడ్డు ప్రమాదం జరిగినట్టు చెప్పారు. నందిత సోదరి నివేదిత ఫిర్యాదు మేరకు పీఏ ఆకాశ్‌పై 304 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్టు తెలిపారు. రోడ్డు ప్రమాద ఘటనపై ఆకాశ్‌ను విచారించామని, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్టు వెల్లడించారు.

### సీటుబెల్ట్ ధరించి ఉంటే..

సాధారణంగా కారులోకి ఎక్కి డ్రైవింగ్ స్టార్ట్ కాగానే సీటుబెల్ట్ పెట్టుకోకపోతే ఐదు నిమిషాలపాటు బెల్ మోగుతుంది. సీటుబెల్ట్ పెట్టుకోగానే సౌండ్ ఆగిపోతుంది. దీంతో చాలా మంది సీటుబెల్ట్‌ను డమ్మీగా పెట్టేసి, సీటుబెల్ట్ ధరించకుండానే ప్రయాణిస్తుంటారు. నందిత కూడా అలాగే చేశారు. తాను సీటుబెల్ట్ ధరించకుండా, డ్రైవర్ పక్క సీటులో డమ్మీగా పెట్టారు. డ్రైవింగ్ సీట్‌లో కూర్చున్న ఆకాశ్ సీటుబెల్ట్ పెట్టుకోగా, పక్కనే ఉన్న లాస్య నందిత సీటుబెల్ట్ లేకుండా ప్రయాణించారు. రోడ్డు ప్రమాదం జరగగానే సీటుబెల్ట్‌లు పెట్టి ఉండటంతో ముందు సీట్లో ఉన్న రెండు, లాస్య నందిత పక్కన ఉన్న బెలూన్ ఓపెన్ అయ్యాయి. లాస్య నందిత సీటుబెల్ట్ పెట్టుకోకపోవడంతో లారీని కారు ఢీకొన్న వెంటనే ఆమె ఎగిరి ముందు భాగాన్ని గుద్దుకున్నారు. దీంతో తలకు బలమైన గాయమైంది. అయితే సాంకేతికంగా సీటుబెల్ట్ పెట్టి ఉండటంతోనే బెలూన్లు ఓపెన్ అయ్యాయి. నందిత సీటుబెల్ట్ ధరించి ఉండి ఉంటే ఆ ప్రమాదం నుంచి బయటపడేవారని భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఆకాశ్‌కు ఎడమ కాలు విరిగింది. తొడ, కంటి రెప్ప భాగంలో కారు అద్దాలు గుచ్చుకొని గాయపడ్డాడు.

## అసలు డ్రైవర్‌ను పక్కనబెట్టడంతోనే..!

హైదరాబాద్ సిటీబ్యూరో/కంటోన్మెంట్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే లాస్య నందిత కారుకు శేఖర్ అనే డ్రైవర్ చాలాకాలంగా పనిచేస్తున్నాడు. అయితే ఈ నెల 13న జరిగిన రోడ్డు ప్రమాద సమయంలో శేఖర్‌కు బదులు మరో వ్యక్తి డ్రైవింగ్ చేశారు. తాజాగా శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాద సమయంలోనూ శేఖర్ డ్రైవింగ్ చేయలేదు. శుక్రవారం లాస్య నందిత కుటుంబసభ్యులు ప్రయాణిస్తున్న వాహనాన్ని శేఖర్ డ్రైవింగ్ చేయగా, ఆమె ప్రయాణిస్తున్న వాహనాన్ని ఆకాశ్ నడిపాడు. లాస్య నందితకు దగ్గరి బంధువైన పీయూష్ రాఘవ అలియాస్ ఛోటు ద్వారా ఆకాశ్.. ఎమ్మెల్యే వద్ద పనిలో చేరాడు. ఇటీవల జరిగిన కానిస్టేబుల్ సెలెక్షన్లలో ఉద్యోగం కోసం ఎంపికయ్యాడు. ఇతనితో ఎంపికైన వారికి ఇటీవలే కానిస్టేబుల్ శిక్షణ ప్రారంభమైంది. తాను రెండో బ్యాచ్‌లో శిక్షణకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నాడు. ఆకాశ్‌కు కారు డ్రైవింగ్ అంతంత మాత్రమే వచ్చని తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో అతి వేగంగా ప్రయాణిస్తున్న కారు ముందు వెళ్తున్న లారీని ఢీకొనడం, ఆ సమయంలో వేగాన్ని నియంత్రించలేకపోవడంతో యువ ఎమ్మెల్యే ప్రమాదంలో చిక్కుకొని మృత్యువాత పడ్డారు.

## అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

కంటోన్మెంట్/మారేడ్‌పల్లి/బొల్లారం/సికింద్రాబాద్, ఫిబ్రవరి 23: ఎమ్మెల్యే లాస్య నందిత మృతదేహానికి శుక్రవారం సాయంత్రం 7 గంటల సమయంలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం రాజారావు ఆధ్వర్యంలో పోస్ట్‌మార్టం నిర్వహించిన అనంతరం ఆమె మృతదేహాన్ని కార్ఖానాలోని ఆమె నివాసానికి తీసుకొచ్చారు. రాజకీయ నేతలు, కార్యకర్తలు, ప్రజలు భౌతికకాయానికి నివాళి అర్పించిన అనంతరం.. మారేడ్‌పల్లి శ్మశానవాటిక వరకు అంతిమయాత్ర నిర్వహించారు. కంటోన్మెంట్‌బోర్డు, రాష్ట్ర సర్కారు అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశాయి. పోలీసులు గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. నందిత అక్క కుమారుడు పీయూష్ రాఘవ ఆమె చితికి నిప్పంటించి అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె తండ్రి దివంగత ఎమ్మెల్యే సాయన్న సమాధి పక్కనే అంత్యక్రియలు నిర్వహించారు.



మారేడ్‌పల్లి శ్మశానవాటికలో అంతిమసంస్కారానికిముందు గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

## పగబట్టిన కాలం.. వెంటాడిన మృత్యువు

యువ ఎమ్మెల్యే లాస్య నందితతో కాలం పగబట్టినట్టుగా వ్యవహరించింది. కొంతకాలంగా మృత్యువు వెంటాడుతూ వచ్చింది. ఏడాది క్రితమే ఆమె తండ్రి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న మృతిచెందారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో లాస్య నందిత బీఆర్‌ఎస్ తరఫున కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. లాస్య నందితను ఇటీవల ప్రమాదాలు వెంటాడాయి. ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం గత డిసెంబర్‌లో సికింద్రాబాద్‌లో ఒక కార్యక్రమానికి హాజరైన ఆమె లిఫ్టులో ఇరుక్కుపోయారు. ఓవర్‌లోడ్ కారణంగా లిఫ్టు కిందకి పడిపోవడంతో లాస్య నందిత మూడుగంటలపాటు లిఫ్టులోను ఉండిపోయారు. అతికష్టంగా ఆమెను లిఫ్టు నుంచి బయటకు తీసి రక్షించారు. ఈ నెల 13న నల్లగొండలో నిర్వహించిన బీఆర్‌ఎస్ బహిరంగ సభ నుంచి తిరిగి వస్తుండగా చర్లపల్లి వద్ద ఆమె ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది. తాజాగా శుక్రవారం జరిగిన ప్రమాదం ఆమె ప్రాణాలనే బలితీసుకున్నది.



లాస్య నందిత భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తలసాని

## పటాన్‌చెరు నుంచి వైకుంఠధామం వరకు..

- లాస్యనందిత కుటుంబసభ్యులకు అండగా
- రోజంతా వెన్నంటే ఉన్న హరీశ్‌రావు
- అంత్యక్రియల్లో పాడె మోసి తుదివీడ్కోలు

సంగారెడ్డి, ఫిబ్రవరి 23(నమస్తే తెలంగాణ): జెండా మోసే కార్యకర్త నుంచి పార్టీ ప్రజాప్రతినిధుల వరకు ప్రతి ఒక్కరినీ గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నది బీఆర్‌ఎస్ పార్టీ. పార్టీ నేతల ఇంట వేడుకలైనా, విషాద ఘటనలు చోటుచేసుకున్నా పార్టీ నాయకత్వం వెన్నంటే ఉంటున్నది. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత తదితరులు పార్టీ శ్రేణులకు అన్నివేళలా కొండంత అండగా నిలుస్తూ వారి కష్టసుఖాలను పంచుకుంటారు. బీఆర్‌ఎస్ యువ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి వార్త తెలిసిన వెంటనే కేసీఆర్ సంతాపం వ్యక్తంచేశారు. ఆమె నివాసానికి వెళ్లి భౌతికదేహానికి నివాళులర్పించారు. కేసీఆర్ సూచనతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు లాస్య నందిత అంత్యక్రియలు పూర్తయ్యే వరకు వెన్నంటే ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో లాస్యనందిత మృతి చెందారనే విషయం తెలిసిన వెంటనే హరీశ్‌రావు హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి హుటాహుటిన బయలుదేరారు. పటాన్‌చెరులోని దవాఖానకు చేరుకొని ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం అక్కడే ఉన్న లాస్యనందిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అధైర్య పడొద్దని, పార్టీ అండగా ఉంటుందని కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. ఆ తర్వాత భౌతికకాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించే సందర్భంలోనూ వెన్నంటే ఉన్నారు. మరో వాహనంలో అంబులెన్స్‌ను అనుసరిస్తూ గాంధీ దవాఖానకు చేరుకున్నారు. గాంధీ వైద్యులతో మాట్లాడి పోస్టుమార్టం త్వరగా పూర్తయ్యేలా చూశారు. అక్కడి నుంచి లాస్య నందిత మృతదేహాన్ని సికింద్రాబాద్ కార్ఖానాలోని ఆమె నివాసానికి తరలించారు. అనంతరం లాస్యనందిత నివాసం నుంచి వెస్ట్‌మారేడ్‌పల్లిలోని వైకుంఠధామం వరకు అంతిమయాత్ర నిర్వహించగా హరీశ్‌రావు స్వయంగా పాడెను మోశారు. అంత్యక్రియలు పూర్తయ్యే వరకు అక్కడే ఉండి అశ్రునయనాలతో కడపటి వీడ్కోలు పలికారు. ఉదయం 8.30 గంటలకు పటాన్‌చెరులోని దవాఖానకు చేరుకున్న హరీశ్‌రావు.. రాత్రి 7.30 గంటలకు అంత్యక్రియలు పూర్తయ్యే వరకు లాస్యనందిత కుటుంబసభ్యుల వెన్నంటే ఉండటం పార్టీ శ్రేణులను కదిలించింది.

## లాస్య మరణం కలచివేసింది

- కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పిన కేసీఆర్
- సీఎం రేవంత్‌రెడ్డి సహా ప్రముఖుల నివాళి

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే లాస్యనందిత భౌతికకాయానికి బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌తోపాటు సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ కార్యకర్తలు నివాళులు అర్పించారు. గాంధీ దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం భౌతికకాయాన్ని కార్ఖానాలోని ఆమె నివాసానికి తరలించారు. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్.. మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి అక్కడకు చేరుకొని నందితకు నివాళులు అర్పించారు. ఆమె కుటుంబసభ్యులను ఓదార్చారు. వారికి బీఆర్‌ఎస్ అన్ని విధాలుగా అండగా ఉంటుందని కేసీఆర్ ధైర్యం చెప్పారు. పిన్న వయసులో ఎమ్మెల్యేగా ప్రజామన్ననలు పొం దిన నందిత రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడం బాధాకరమని, తనను తీవ్రంగా కలచివేసిందని అన్నారు.

### సీఎం నివాళి

మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి కార్ఖానాలోని నందిత నివాసానికి వెళ్లి భౌతికకాయానికి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. నందిత అకాలమరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని పేర్కొన్నారు. నందిత తండ్రి సాయన్నతో తనకు ఉన్న సాన్నిహిత్యాన్ని సీఎం గుర్తుచేసుకున్నారు. అంతకుముందు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గాంధీ దవాఖానకు వెళ్లి నివాళి అర్పించారు. లాస్య అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించాలని సీఎం ఆదేశించారని కోమటిరెడ్డి చెప్పారు. లాస్య నందిత భౌతికకాయానికి నివాళులు అర్పించినవారిలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎంపీలు కేశవరావు, సంతోష్‌కుమార్, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాసరెడ్డి, కడియం శ్రీహరి, వేముల ప్రశాంత్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, దానం నాగేందర్, వేముల వీరేశం, ముఠా గోపాల్, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు గజ్జెల నగేశ్, క్రిశాంక్, ఎర్రోళ్ల శ్రీనివాస్, పాటిగడ్డ జగన్మోహన్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

### మార్చురీ వద్ద బీఆర్‌ఎస్ నేతల నివాళి

లాస్య నందిత మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించడంతో బీఆర్‌ఎస్ నేతలు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, బండారు లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శంభీర్‌పూర్ రాజు, రాజీవ్‌సాగర్, ఎర్రోళ్ళ శ్రీనివాస్, గజ్జెల నాగేశ్‌తో సహా పెద్ద ఎత్తున నాయకులు, అభిమానులు గాంధీ మార్చురీ వద్దకు చేరుకున్నారు.

### ప్రముఖుల సంతాపం

ఎమ్మెల్యే లాస్య నందిత అకాలమరణం పట్ల శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్‌తోపాటు బీఆర్‌ఎస్ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, మాజీ మంత్రులు సంతాపం ప్రకటించారు. నందిత మృతిపై మాజీ స్పీకర్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదనాచారి, మాజీ మంత్రులు మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, గంగుల కమలాకర్, కడియం శ్రీహరి, ఇంద్రకరణ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, జనారెడ్డి, బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, లోక్‌సభలో బీఆర్‌ఎస్ పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు ప్రభాకర్‌రావు, శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు సంతాపం ప్రకటించారు.

### తెలంగాణభవన్‌లో..

తెలంగాణభవన్‌లో ఎమ్మెల్యే నందిత చిత్రపటానికి పూలమాల వేసి పలువురు నేతలు నివాళ్లర్పించారు. వారిలో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు ఎం శ్రీనివాస్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, ఆర్ సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, బీఆర్‌ఎస్ నాయకులు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### తేరుకోలేని షాక్ : కేటీఆర్



ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మరణం తేరుకోలేని షాక్ అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. ఎమ్మెల్యే లాస్య ఇకలేరు అనే అత్యంత విషాదకరమైన విషయం తెలిసి షాక్‌కు గురయ్యానని తెలిపారు. యువ శాసన సభ్యురాలిని కోల్పోవడం తీరని నష్టమని పేర్కొన్నారు.

## ఏడాదికే తీరని లోకాలకు తండ్రీకూతురు

- నిరుడు ఫిబ్రవరి 19న సాయన్న మృతి
- మొదటి వర్ధంతి జరిగిన 4 రోజులకే రోడ్డు ప్రమాదంలో కూతురి దుర్మరణం

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ రాజకీయాల్లో సాయన్న కుటుంబంలోని మరణాలు తీరని విషాదాన్ని మిగిల్చాయి. ఎమ్మెల్యే లాస్యనందిత తండ్రి సాయన్న నిరుడు ఫిబ్రవరి 19న అకాల మరణం చెందారు. ఆయన మొదటి వర్ధంతి గడిచిన నాలుగు రోజులకే లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఏడాదికే తండ్రీ కూతురు ఈ లోకాన్నీ వీడిపోవడం ప్రతి ఒక్కరినీ కలచివేసింది. కాలం పగబట్టినట్టుగానే సాయన్న కుటుంబాన్ని ఫిబ్రవరి మాసం వెంటాడి ఆ ఇంట ఇద్దరిని కబలించింది. లాస్యనందితను ఎమ్మెల్యే అయిన మూడు నెలల్లోనే మృత్యువు వెంటాడింది. ఇప్పటికే రెండు సార్లు జరిగిన ప్రమాదాల్లో తప్పించుకున్న లాస్యనందిత మూడోసారి తరుముకొచ్చిన గండం నుంచి తప్పించుకోలేకపోయారు. తండ్రీబిడ్డలు రాజకీయాల్లో అజాతశత్రువుగా అందరి మన్ననలు పొందారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా సాయన్న చెరగని ముద్ర వేసుకోగా.. చిన్న వయసులోనే కార్పొరేటర్‌గా, ఎమ్మెల్యేగా గెలిచి లాస్యనందిత ప్రజల మనసు గెలుచుకున్నారు. వీరిద్దరూ ప్రజలతో నిత్యం మమేకమై అనేక సమస్యలను పరిష్కరించి, మృధుస్వభావిగా మంచిపేరు తెచ్చుకున్నారు. కులమతాలు, ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా వ్యవహరించే ఈ ఇద్దరు ఆదర్శవంతమైన వ్యక్తులుగా ప్రశంసలు అందుకున్నారు. సాయన్నకు ముగ్గురు కూతుళ్లలో చిన్న కూతురైన లాస్య నందిత అంటే అమితమైన ప్రేమ. చిన్నప్పటి నుంచీ ఆమెను అతి గారాబంగా పెంచారు. ప్రజాజీవితంలో తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న లాస్యనందిత చిన్న వయసులోనే అనంతలోకాలకు వెళ్లడం నిజంగా విధి ఆడిన క్రూర నాటకమే.

### రాజకీయాల్లో తండ్రికి తగ్గ బిడ్డగా..

1987లో హైదరాబాద్‌లో జన్మించిన లాస్యనందిత కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ పూర్తి చేశారు. తండ్రి చాటు బిడ్డగా కాకుండా తండ్రికి తగిన బిడ్డగా నిరూపించుకున్నారు. ఆమె 2015లో రాజకీయాల్లోకి వచ్చారు. కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. 2016లో సాయన్నతోపాటు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఆమె 2016-2020 మధ్య కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్‌గా పనిచేశారు. 2021 జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కవాడిగూడ నుంచి ఓటమి పాలయ్యారు. 2023లో కంటోన్మెంట్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గణేశ్‌పై 17,169 ఓట్ల మెజారిటీతో ఆమె విజయం సాధించారు. రాజకీయంగా ఎంతో భవిష్యత్ ఉంటుందని భావిస్తున్న తరుణంలో.. చిన్న వయసులోనే లాస్య ఇలా దుర్మరణం చెందడం పట్ల పలువురు నేతలు తీవ్ర విచారం వ్యక్తంచేస్తున్నారు. ఏడాదికే ప్రజాప్రతినిధుల హోదాలోనే తండ్రీకూతురు మృతి చెందడంతో పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.